క్లుప్తంగా

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే, నాయకులు



మంత్రి పొంగులేటితో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, నాయకులు

వైరా: రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖామంత్రిగా మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ గృహ నిర్మాణ శాఖా మంత్రిగా పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారిని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, వైరా కాంగ్రెస్ నాయకులు బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, మిట్టపల్లి నాగి, పోలా శ్రీను, శీలం వెంకటనర్సిరెడ్డి, తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భట్టి విక్రమార్క నివాస భవనం ప్రజాభవన్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మధిర: మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ సాధు సమాధానం మాట్లాడుతూ.. ఇంధన పొదుపు భవితకు మదుపు అని తెలిపారు. మానవుని నిత్యజీవితంలో ఇంధనం కీలకపాత్ర పోషిస్తుందని, ఇంధన వినియోగం భారీగా పెరిగిపోతుందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోట నరసింహారావు, బూసా కోటేశ్వరరావు, ఆదాం, కిషోర్, రామిరెడ్డి, కృష్ణయ్య, జ్యోతిర్మయి, రాణి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



సేవాసదనానికి దుప్పట్లు అందిస్తున్న కోటేశ్వరరావు

మధిర: ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామానికి చెందిన సుఖభోగి నాగరత్నమ్మ, గురవయ్య జ్ఞాపకార్థం వారి తనయుడు కోటేశ్వరరావు అందిచిన ఆర్థిక సాయంతో మధిర పట్టణంలోని మదర్‌థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగ పిల్లలకు గురువారం ఉచితంగా ఉన్ని దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవాసదనం నిర్వాహకురాలు స్వర్ణలత మాట్లాడుతూ.. సుఖభోగి నాగరత్నమ్మ, గురవయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, మానవతా దృక్పథంతో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేసిన కోటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదూరి అబ్రహం, గండమాల ప్రసాదరావు, జూపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెయింటర్ల సంఘం మండల కమిటీ ఎన్నిక



మండల పెయింటర్ల నూతన కమిటీ

కల్లూరు: కల్లూరు మండల పెయింటింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మేక భద్రాచలం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మేజర్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మండలంలోని పెయింటర్ల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ లక్కినేని రఘు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కోట పుల్లారావు, యాదల రాజా, ప్రధాన కార్యదర్శిగా పుట్టబంతి భద్రాచలం, సహాయ కార్యదర్శులుగా తేల అబ్రహం, కొండ రామకృష్ణలు, ప్రచార కార్యదర్శులుగా గరిడేపల్లి తిరుపతిరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భద్రాచలం మాట్లాడుతూ.. పెయింటర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

కేసు నమోదు

చింతకాని: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. మండలంలోని జగన్నాథపురం గ్రామ సమీపంలో పోలీసులు గురువారం వాహనాల తనిఖీని చేపట్టారు. అతివేగంగా వెళ్తున్న నాలుగు వాహనాలను గుర్తించి వాహనాలకు సంబంధించిన యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై ఎస్సై అవగాహన కల్పించారు.

బ్యాంక్ లింకేజీతో ఆర్థికాభివృద్ధి

- కల్లూరు మండలంలో 988 గ్రూపులకు రూ. 54.18 కోట్లు లక్ష్యం
- ఆర్థికంగా బలపడుతున్న మహిళలు



కల్లూరులో బ్యాంక్ లింకేజ్ ద్వారా ఏర్పాటు చేసిన కిరాణం



కల్లూరు: పేదరికంలో ఉన్న కుటుంబాలకు చేదోడు వాదోడుగా ఉంటూ వారి జీవనోపాధి పెంపొందించడానికి బ్యాంక్ లింకేజ్ రుణాలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి. బ్యాంక్ లింకేజ్ ద్వారా మహిళలు చిరు వ్యాపారాలు, డైరీ ఫామ్‌లు, పాడి గేదెల పెంపకం, పిండి మిల్లులు, కారం మిల్లులు, కిరాణా షాపులు తదితర చేతనైన పనులను ప్రోత్సహిస్తూ వారు చేసుకున్న పొదుపు ద్వారా బ్యాంక్ లింకేజ్ రుణాలు ఎంతగానో దోహద పడుతున్నాయి.

2 లక్షల నుంచి 20 లక్షల వరకు..

1998 నుంచి ప్రభుత్వం ఈ బ్యాంక్ లింకేజ్ రుణాలను మంజూరు చేస్తుంది. గ్రూపులు ఏర్పాటు చేసుకున్నప్పటి నుంచి సభ్యులు చేసిన పొదుపు, వారి సీనియారిటీ ఆధారంగా రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బ్యాంక్ లింకేజ్ రుణాలు ఇవ్వడం జరుగుతుంది.

మండలంలో 54.18 కోట్లు లక్ష్యంగా..

కల్లూరు మండలంలో 1587 ఎస్‌హెచ్‌జీ గ్రూపులుండగా ఈ ఆర్థిక సంవత్సరంలో 988 గ్రూపులకు రూ. 54.18 కోట్ల మేరకు బ్యాంక్ లింకేజ్ రుణాలు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 325 గ్రూపులకు రూ. 27.60 కోట్ల మేరకు బ్యాంక్ లింకేజ్ రుణాలు ఇవ్వడం జరిగింది. ఒక్కో గ్రూపులో 10 మంది సభ్యులు ఉంటారు. వారు చేసిన పొదుపును బట్టి బ్యాంక్ లింకేజ్ రుణాలు ఉంటాయి. తీసుకున్న బ్యాంక్ లింకేజ్ రుణాలు సక్రమంగా చెల్లిస్తే తిరిగి రుణాన్ని పెంచడం జరుగుతుంది. బ్యాంక్ లింకేజ్ ద్వారా రూరల్ ఓట్‌లెట్ పొందిన సభ్యులు తమ జీవనోపాధిని, తమ కుటుంబ ఆదాయాన్ని పెంపొందించుకుటూ సుస్థిర ఆదాయాన్ని పొందుతున్నారు.

రూ.3 లక్షలు రుణం తీసుకున్నా..



బ్యాంక్ లింకేజ్ ద్వారా రూ.3 లక్షల రుణం తీసుకున్నా. కల్లూరులో కిరాణా, జనరల్ స్టోర్ ఏర్పాటు చేసుకుని ఏడాదిన్నర కావస్తుంది. తీసుకున్న రుణం సక్రమంగా చెల్లిస్తూ జీవనోపాధిని చూసుకుంటున్నా. ప్రస్తుతం బాగానే ఉంది.

– రామిశెట్టి హారిక, కల్లూరు

రుణాలు సక్రమంగా చెల్లించాలి..



బ్యాంక్ లింకేజ్ రుణాలు తీసుకున్న సభ్యులు సక్రమంగా చెల్లిస్తే వారికి తిరిగి రుణాలను పెంచి ఇవ్వడం జరుగుతుంది. ఇచ్చిన రుణాలను సద్వినియోగం చేసుకుని తమ కుటుంబ ఆదాయ వనరులను పెంపొందించుకోవాలి.

– ఎం.వెంకట రామారావు, ఏపీఎం, కల్లూరు

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

కల్లూరురూరల్: మండలంలోని పుల్లయ్య బంజరు శివాలయం వద్ద మల్లిక గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్డీఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బానోత్ దర్గయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యంలో తేమశాతాన్ని చూసి ఖచ్చితమైన కొలతలతో ధాన్యం కాటా వేయాలన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు.



పుల్లయ్య బంజరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఏ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ దర్గయ్య

మహిళా సాధికారత సాధిస్తేనే సమాజాభివృద్ధి



అవగాహన కల్పిస్తున్న సత్తుపల్లి రూరల్ సీఐ సీహెచ్ హనూక్

పెనుబల్లి: సమాజంలో మహిళలు సాధికారత సాధించినప్పుడే సమాజం అభివృద్ధి మార్గంలో దూసుకుపోతుందని సత్తుపల్లి రూరల్ సీఐ సీహెచ్ హనూక్ అన్నారు. గురువారం టేకులపల్లి ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన మహిళా సాధికారత సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆడపిల్ల చదువు ఇంటికి, సమాజానికి వెలుగు అన్నారు. బాలికలను సమస్యలను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పిస్తూ చట్టపరమైన రక్షణ చర్యలను వివరించారు. మహిళా సాధికారత క్లబ్‌ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.నాగరాజు, కిషోర్, నరసింహారావు, రఘునందన్ రెడ్డి, దుర్గ భవాని, నవీన ప్రియ సుధా, సత్యకుమారి, రెహమాన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మిర్చిలో క్షేత్ర ప్రదర్శన

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెంలో గురువారం మిర్చిపంట క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. గ్రామానికి చెందిన లాలా కృష్ణ కార్తికేయ్ సీడ్స్ కంపెనీ వారి అంకిత–29 రకం మిర్చి విత్తనాలు సాగు చేయగా అన్ని రకాల తెగుళ్లను తట్టుకుని మంచి దిగుబడులు సాధించింది. ఎకరానికి సుమారు 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల వచ్చిన తుఫాన్‌కు చాలా తోటలు దెబ్బతినడంతో పాటు.. నల్లి బాధిస్తున్నా ఈ తోట మాత్రం మంచి కాపుతో ఏపుగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా సుమారు 300 మంది రైతులు మిరప తోటను పరిశీలించి రైతు అనుభవాన్ని అడిగి తెలుసుకున్నారు. శ్రీసాయి ఏజెన్సీస్ డిస్ట్రిబ్యూటర్ సాయికిరణ్, అంకిత ప్రతినిధి ఉమాకర్, శ్రీను, మండలంలోని పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



అమ్మపాలెంలో రైతు లాలా కృష్ణకు బహుమతి అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

సీజనల్ వ్యాధులపై అవగాహన



వైద్య పరీక్ష చేస్తున్న వైద్యురాలు కుమారి

ఎర్రుపాలెం: మండలంలోని వెంకటాపురం గ్రామంలో బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై పీహెచ్‌సీ వైద్యురాలు చెరుకుమల్లి కుమారి అవగాహన కల్పించారు. పలువురి రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరు పౌష్టికాహారం తీసుకొని వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి ఆవరణలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు



కల్లూరుకు సమీపంలో లీకేజీ

కల్లూరురూరల్: మండలంలోని పలు చోట్ల మిషన్ భగీరథ నీరు లీకేజీ అవుతుండడంతో తాగునీరు వృథాగా పోతుందని ప్రజలు తెలుపుతున్నారు. కల్లూరు సమీపంలో పైపులైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతున్నా ఇటు భగీరథ కాంట్రాక్టర్, అటు అధికారులు, సిబ్బంది చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు లీకేజీలను గుర్తించి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు ఖాసీమ్

కొణిజర్ల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు షేక్ ఖాసీమ్ డిమాండ్ చేశారు. మండలంలోని గుబ్బగుర్తిలో గురువారం రొంటె గంగన్న అధ్యక్షతన నిర్వహించిన ఆ సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలన్నారు. మండలంలోని జాగీర్దార్ భూములను సాగు చేస్తున్న నిరుపేదలందరికీ పట్టాలు ఇప్పించాలన్నారు. ఖాసీమ్‌ఖాన్, బాషా, కిషన్, లచ్చన్న, కృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బస్సుల రద్దీతో విద్యార్థుల ఇక్కట్లు



సత్తుపల్లి: మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం ప్రభుత్వం కల్పించటంతో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో రద్దీ పెరిగింది. మహిళా ప్రయాణికులతో బస్సులు కిక్కిరిసి పోతుండటంతో పాఠశాలలు, కళాశాలల నుంచి స్వగ్రామాలకు వెళ్లే విద్యార్థులు బస్సుల రద్దీతో అవస్థలు పడాల్సి వస్తోంది.

అయ్యప్ప మాలధారుల ప్రత్యేక పూజలు



ఇరుముడితో శబరిమలై వెళ్తున్న అయ్యప్ప మాలధారులు

మధిర: అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. మధిర పట్టణంలోని లడక బజారులో వేంచేసి ఉన్న శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయంలో భక్తులు గత 41 రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో దీక్ష చేపట్టి శబరిమలై సన్నిధికి తరలి వెళ్లేందుకు ఆలయంలో ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అయ్యప్ప భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం గురుస్వామి బత్తుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇరుముడులతో అయ్యప్ప దీక్షాపరులు శబరిమలై తరలివెళ్లారు.

సాయినాథుడికి..

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు చేశారు. శ్రీసాయిబాబా వారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు బాబాని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. మండలకేంద్రంలోని ఆలయంలో తెల్లపాలెం గ్రామానికి చెందిన బట్టా శంకర్‌రావు–ఆదిలక్ష్మి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి, సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న పాస్టర్లు

వైరా: వైరా పాస్టర్స్, ఇవాంజలిస్టు అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. వైరాలో షారోన్ మినిస్ట్రీస్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో 2024 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు స్టీవెన్‌సన్ సభ్యులందరినీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి అందరికీ శుభం జరగాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సురేష్, వినోద్‌కుమార్, యోషయా, రూపస్ బాబు, చిలకా కోటయ్య, కోర్నేలి, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

సత్తుపల్లిటౌన్: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సత్తుపల్లి ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య అన్నారు. గురువారం స్థానిక రవాణా శాఖా కార్యాలయంలో వాహనదారులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, కార్లు నడిపేటప్పుడు సీటు బెల్ట్ పెట్టుకుంటే ప్రమాదాల నుంచి సురక్షితంగా బయట పడచ్చొన్నారు. ఓవర్‌టేక్ చేసేటప్పుడు అద్దంలో చూసుకుంటూ ముందుకు వెళ్లాలని.. వెనుక వచ్చే వాహనాలు దగ్గరగా ఉన్నాయో.. దూరంగా ఉన్నాయో గమనిస్తూ వాహనాలు నడపాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదాల బారినపడే అవకాశం ఉందన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులకు జైలుశిక్ష పడుతుందని.. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రవాణాశాఖ సిబ్బంది కృష్టారావు, ప్రసాదరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె

సత్తుపల్లిటౌన్: పేరివిజన్ కమిటీ కమలేష్ చంద్ర సానుకూల సిఫార్సులను అమలు చేసేంత వరకు సమ్మె విరమించేది లేదని గ్రామీణ తపాలా ఉద్యోగులు స్పష్టం చేశారు. సత్తుపల్లి పోస్టాఫీస్ వద్ద గల శిబిరంలోని గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం మూడో రోజుకు చేరుకుంది. డాక్ సేవక్‌లను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని, 8 గంటల పని కల్పించాలని గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సీనియారిటీ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, గ్రాట్యూటీ పెంచాలని, డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు ఉన్న అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సమ్మెకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఏఐజీడీ ఎస్‌యూ బ్రాంచ్ కార్యదర్శి బి.కృష్ణప్రసాద్, ప్రెసిడెంట్ కె.వెంకటేశ్వర్లు, వి.మహేష్, మౌనిక, రమ్య, ఎన్‌యూజీడీఎస్ బ్రాంచ్ సెక్రటరీ, బి.నర్సింహారావు, సంజీవరావు, రామయ్య, జయరాజు, ఎస్‌డీ జానీ, కోటమర్తి వెంకటేశ్వరరావు, ఖాజాబి, పాషా, ఐ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డిమాండ్లు న్యాయమైనవి..



సమ్మెలో పాల్గొన్న నాయకులు

కారేపల్లి: తపాలా గ్రామీణ ఉద్యోగుల సమస్యలు న్యాయపరమైనవని, వారి సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐజీడీ ఎస్‌యూ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ కార్యదర్శి బండి జయరాజు, జిల్లా అధ్యక్షుడు పట్టాభి రామయ్య గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కారేపల్లిలో తపాల ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మౌలాలి, మహ్మద్, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, తాతా అచ్చారావు, రామకృష్ణ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

వైరా: మిచాంగ్ తుఫాన్ వల్ల పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ధాన్యానికి బోనస్ ప్రకటించాలని కోరారు. మిర్చి తోటలకు వైరస్ సోకి రైతులు తీవ్రంగా నష్టపోయారని, తుఫాన్ వల్ల పత్తి, వరి రైతులు పంటలు తడిచి మొక్కలొచ్చి ఇబ్బందులు పడుతున్నారని సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, మేడా శరాబంధీ, తోట నాగేశ్వరరావు, సుంకర సుధాకర్, పారుపల్లి కృష్టారావు, సాంబశివరావు, మురళి, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాన్ని సందర్శించిన 'యూటీఎఫ్'

మధిరరూరల్: జిలుగుమాడులో ఉన్న మైనారిటీ గురుకుల విద్యాలయాన్ని గురువారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) బృందం సందర్శించింది. యూనియన్ మధిర మండల అధ్యక్షుడు ఏ.వినోదరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి, ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ రావిరాల లక్ష్మణరావు మాట్లాడుతూ.. టీఎస్‌యూటీఎఫ్ మైనార్టీ గురుకుల రాష్ట్ర సబ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా ఉపాధ్యాయులు క్రాంతి కుమార్‌కు అభినందనలు తెలిపారు. కేర్ టేకర్ నియామకం, శిక్షణ తరగతుల పేరుతో వేధింపులు, బోధనేతర పనుల బాధ్యతల నుంచి ఉపాధ్యాయుల మినహాయింపు చేయాలని డిమాండ్ చేశారు. రెసిడెన్షియల్ పాఠశాలలో అన్నింటిని ఒకే గొడుగు కిందకు తెచ్చే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు షేక్ లాల్ అహ్మద్, కొండలరావు, సాంబయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షేక్ నాగూర్ వలి

ఆలయ వార్షికోత్సవ వేడుకలకు వేళాయే..



తల్లాడలోని ఆలయంలో కొలువైన మహా గణపతి, సుబ్రహ్మణ్య స్వామివార్లు

తల్లాడ: తల్లాడలోని కొత్తగూడెం రోడ్డులో వేంచేసి ఉన్న మహా గణపతి, సుబ్రహ్మణ్య స్వామి మందిర నాలుగో వార్షికోత్సవ వేడుకలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 17, 18 తేదీల్లో వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరగనున్నాయి. 17న మంగళ తోరణాలంకరణ, గోపూజ, విఘ్నేశ్వరపూజ, పంచామృతాభిషేకములు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. 18న సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా కావడి సేవ, స్వామి వార్ల పల్లకి ఊరేగింపు, వల్లీదేవీ సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో మూడో వార్షికోత్సవం..

జిల్లాలోనే అతిపెద్ద సుబ్రహ్మణ్య స్వామి 16 అడుగుల విగ్రహ ప్రతిష్ఠ మూడో వార్షికోత్సం స్థానిక రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 18న నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు కంచెల సతీష్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 108 కిలోల విభూతితో మహా కుంబాభిషేకం, సుబ్రహ్మణ్య స్వామి దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.